

విజేతలకు కలెక్టర్ అభినందనలు

కడప : ఈనెల 1వ తేదీ నుంచి 5 వరకు తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఏపీ సీఎం కప్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జిల్లా జట్ల క్రీడాకారులను మంగళవారం కలెక్టర్ విజయ్ రామరాజు అభినందించారు. ఫుట్‌బాల్ మహిళా విభాగంలో మొదటి స్థానంలో జిల్లా జట్టు నిలిచింది. హ్యాండ్ బాల్ పురుషుల జిల్లా జట్టు రెండవ స్థానంలో నిలిచింది. బ్యాడ్మింటన్‌లో మహిళా జట్టు మూడవ స్థానంలో, పురుషుల జట్టు రెండవ స్థానంలో నిలిచాయి. హాకీలో పురుషుల జట్టు మూడవ స్థానంలో, టెన్నీస్‌లో మహిళా జట్టు రెండవ స్థానంలో, పురుషుల జట్టు మూడవ స్థానంలో నిలిచాయి. బాక్సింగ్‌లో పురుషుల జట్టు మూడో స్థానంలో, మహిళా విభాగంలో జిల్లా క్రీడాకారుని మొదటి స్థానంలో, పురుషుల విభాగంలో రెండవ మూడవ స్థానంలో క్రీడాకారులు నిలిచారు. వీరందరిని మంగళవారం సాయంత్రం కలెక్టర్ విజయ్ రామరాజు, స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డిఎస్‌ఎ చీఫ్ కోచ్ అమృతరాజ్, సిబ్బంది, కోచ్ లు, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మట్టి..కొల్లగొట్టి!

జిల్లాలోని మట్టి వనరులపై అక్రమార్కుల కన్నుపడింది. కడప డివిజన్ పరిధిలోని నాలుగు చెరువుల్లో కొంత మంది మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకుని ఇష్టానుసారంగా తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. పుట్లంపల్లి వాసులు తమ చెరువులో అక్రమ రవాణాను నిలువరించడానికి హైకోర్టుకు వెళ్లారు మట్టి అక్రమ రవాణా నిరోధానికి హైకోర్టు ఉత్తర్వులు తీసుకురావాల్సి వచ్చిందంటే మట్టి వనరులను కొల్లగొట్టడం ఏ స్థాయిలో సాగుతోందో అర్థం చేసుకోవాల్సి ఉంది. ఇంతటి స్థాయిలో అక్రమ రవాణా సాగుతున్న నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్ ఇంజనీరింగ్ యంత్రాంగం చెరువుల్లో అక్రమ రవాణా నివారణపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- కడప డివిజన్‌లో నాలుగు చెరువులకు అనుమతులు
- చెర్లోపల్లి, తప్పెట్ల చెరువుల్లో అక్రమ రవాణా
- పర్మిషన్ ముసుగులో 'రియల్'కు తరలింపు
- భారీగా సొమ్ము చేసుకున్న అక్రమార్కులు
- పట్టణ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో మట్టి అక్రమ రవాణా పతాకస్థాయికి చేరుకుంది. కడప డివిజన్‌లో చెర్లోపల్లి, తప్పెట్ల, కమలాపురం, పెండ్లిమర్రి మండలం పెద్దదాసరిపల్లె చెరువుల్లో 48 రోజులుగా ఇష్టానుసారంగా మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. మట్టి రవాణా అక్రమార్కులు పట్టాదారు పాసుపుస్తకాల ఆధారంగా అనుమతులు పొందిన తర్వాత రియల్ ఎస్టేట్ ఇతర కమర్షియల్ వ్యాపారాలకు తరలించడం పరిపాటిగా మారింది. ఉదాహరణకు పాసుపుస్తకాల ఆధారంగా 50 టిప్పులకు అనుమతులు లభిస్తే అక్రమార్కులు వందలాది టిప్పులు తరలించడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. అవధులు మించిన అక్రమ రవాణా నేపథ్యంలో తమ గ్రామాలకు సమీపంలోని చెరువుల నుంచి యథేచ్ఛగా మట్టిని తర లించడం పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ లెక్కచేయని వైనం విస్మయాన్ని కలిగిస్తోంది.

తగ్గిన ఇరిగేషన్ ప్రాధాన్యత

జిల్లాలో మట్టి వనరుల తరలింపు అనుమతులకు కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీలో రెవెన్యూకు అగ్రస్థానం లభించింది. చెరువుల్లో మట్టి తరలింపునకు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనుమతులు ఇవ్వడం పరిపాటి. ఇటీవలికాలంలో అక్రమ రవాణా పెరిగిన నేపథ్యంలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పడింది. ఇరిగేషన్‌శాఖను టెక్నికల్‌కు పరిమితం చేసింది. రెవెన్యూ శాఖకు ప్రాధాన్యత ఇచ్చింది. ఫలితంగా ట్రాక్టర్‌కు రూ.250, టిప్పర్‌కు రూ.750 చొప్పున రెవెన్యూ వసూలు బాధ్యతను అప్పగించింది. పాసుపుస్తకాల ఆధారంగా ఇచ్చిన అనుమతి మేరకు డబ్బులు చెల్లించుకుని రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయికి వెళ్లకపోవడం అందరికీ తెలిసిందే. ఇరిగేషన్ ఇంజినీరింగ్ యంత్రాంగం కనీసం ఎఇ స్థాయి అధికారిని సైతం మట్టి తవ్వకాలకు కేటాయించడం లేదు. చెరువుల్లో మీటరు నుంచి రెండు మీటర్లలోపు మట్టి తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. రెవెన్యూ, ఇరిగేషన్ యంత్రాంగం క్షేత్రస్థాయికి వెళ్లని నేపథ్యంలో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎటువంటి విమర్శలు లెక్కచేయని అక్రమార్కులు ఆడిందే పాడిందే పాటగా ఇష్టానుసారం హిటాచీలతో టిప్పర్లు, ట్రాక్టర్ల మాటున పెద్దఎత్తున తవ్వకాలకు పాల్పడుతున్న వైనం నిరాఘా టకంగా సాగిపోతోంది.

యథేచ్ఛగా రియల్ ఎస్టేట్‌కు తరలింపు

జిల్లాలోని అనుమతులు పొందిన చెరువుల నుంచి యథేచ్ఛగా రియల్ ఎస్టేట్, ఇతర కమర్షియల్ కార్యాకలాపాలకు మట్టి తరలిపోతోంది. కడప పట్టణ కేంద్రం సమీపంలోని చెర్లోపల్లి చెరువు నుంచి పెద్దఎత్తున కడప, కమలాపురం పట్టణ ప్రాంతాల్లో వెలిసిన లేఅవుట్లు, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు మట్టి అక్రమంగా తరలిపోతోంది. నెలన్నర రోజులుగా టిప్పర్‌కు 250, టిప్పర్‌కు రూ.750 చొప్పున చెల్లించి, కడప, కమలాపురం పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్, వెంచర్లు, ఇతర కమర్షియల్ కార్యకలాపాలకు ట్రిప్పర్ మట్టి రూ.ఐదువేలకుపైగా విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి చెరువు నుంచి రోజుకు కనీసం వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లలో మట్టి తరలిపోతోంది. మట్టి అక్రమార్కులు కోట్లాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కమలాపురం, వల్లూరు, పెండ్లిమర్రి మండలంలోని తప్పెట్ల చెరువుల్లోనూ మట్టి అక్రమ రవాణా ఆగడం లేదు. జిల్లాలోని బాధ్య తహశీల్దార్లలో కనీసంగానైనా స్పందన కనిపించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. మట్టి అక్రమ రవాణా వ్యవహారంలో ప్రొసీడింగ్స్ ఇచ్చిన ఆర్‌డిఒను ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

మట్టి తరలింపును నిలిపేశాం

కడప రెవెన్యూ డివిజన్‌లో మట్టి తరలింపు వ్యవహారాన్ని నిలిపేశాం. వేసవి సీజన్‌లో పొలాలకు మట్టి కావాలనే అభ్యర్థన నేపథ్యంలో కమిటీ అనుమతులు ఇచ్చిన మాట వాస్తవమే. చెర్లోపల్లి చెరువు వ్యవహారంలో చోటుచేసుకున్న ఉదంతంతో మట్టి తరలింపును నిలిపేశాం.

– డి.వెంకట రామయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, కడప

'జగనన్నకు చెబుదాం'

పటిష్టంగా అమలు చేస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, ఎస్‌పి, ప్రజాప్రతినిధులు

వేగవంతమైన, నాణ్యమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు పరుస్తామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు, ఎస్‌పి అన్బురాజన్ సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయం నుంచి 'జగనన్నకు చెబుదాం' టోల్ ఫ్రీ నెంబర్ :1902 కాల్ సెంటర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి కలెక్టర్, ఎస్‌పి, జెసి గణేష్‌కుమార్, ఎస్‌ఎస్‌పి ప్రేరణకుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. విసి ద్వారా కలెక్టర్, ఎస్‌పి నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల పనితీరు బాగుందని ప్రభుత్వ పాలన కూడా సంతృప్త స్థాయిలో సాగుతుందనే ప్రభుత్వ నమ్మకాన్ని మరింత గట్టిగా అమలు చేస్తామన్నారు. గ్రామ వార్డు సచివాలయ పరిధి నుంచి మండల, డివిజన్, జిల్లా స్థాయి వరకు అన్ని స్థాయిల అధికారులు బాధ్యతతో, నిబద్ధతతో కార్యక్రమాన్ని వందశాతం విజయవంతం అయ్యేలా అమలు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని కూడా ఈ అంశంలో మరింత పటిష్టపరుస్తూ జిల్లాలో మహిళా పోలీసుల నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టేందుకు టీములను ఏర్పాటు చేసి 'జగనన్నకు చెబుదాం' విజయవంతం నిర్వహించి సమస్యలు లేని వైఎస్ఆర్ జిల్లాగా మారుస్తామని చెప్పారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే 1902కు నేరుగా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం అందించే స్కీమ్స్, పెన్షన్, రేషన్ కార్డు వంటివి పొందడంలో అవాంతరాలు ఎదురైనా, రైతులు, మహిళలు, ప్రభుత్వ సేవలు పొందడంలో సమస్యలుంటే ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక విసి హాలు నుంచి డిఆర్ఒ గంగాధర గౌడ్, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నలుగురు అంతర్రాష్ట్ర బైక్ దొంగలు అరెస్టు



చోరీకి గురైన బైకులను పరిశీలిస్తున్న ఎస్‌పి

కడప : అంతర్రాష్ట్ర బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను పోలీసుల అరెస్ట్ చేశారని ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి నుంచి 21 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. వీటి విలువ రూ. 16 లక్షలు ఉంటుందని చెప్పారు. జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల అర్బన్ సిఐ మంజునాథ్ రెడ్డి, ఎస్‌ఐలు కృష్ణయ్య, ప్రవీణ్ కుమార్ కలిసి నలుగురు దొంగలను పట్టుకున్నారని చెప్పారు. అరెస్టయిన వారిలో ప్రసాదు, పుల్లారెడ్డి, నరసింహులు, చరణ్ కుమార్ ఉన్నారని పేర్కొన్నారు. సిసి కెమెరాలు లేని ప్రాంతంలో నకిలీ తాళం చెవులతో బైకులను దొంగతనం చేసే వారిని తెలిపారు. వీరిపై కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి, నంద్యాల, కర్నూల్ జిల్లాలతో పాటు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలలో ఆరు నెలల కాలంలో 25 మోటార్ బైకులను దొంగలించారని చెప్పారు. నిందితులను ఈనెల 8న ఎర్రగుంట్ల సమీపంలోని ఐసిఎల్ ఫ్యాక్టరీ దగ్గర పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు.

అన్నను హత్య చేసిన తమ్ముడు అరెస్టు

కడప : నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సర్యాజీపుర వీధిలో ఈనెల 7న అర్ధరాత్రి సమయంలో ఆగ్రహావేశంతో తన అన్న షేక్ మహమ్మద్ ఇసాక్ (25)ను తమ్ముడు అబుబసర్ అలియాస్ అబ్బో పిడిబాకుతో దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో నిందితుడు, మృతుని సోదరుడు షేక్ అబూబసర్ అలియాస్ అబ్బు ను పోలీసులు సోమవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో గౌస్ నగర్ కెసి కెనాల్ సమీపంలో అరెస్టు చేశారు. అతని దగ్గర నుంచి హత్యకు ఉపయోగించిన పిడి బాకును సీజ్ చేశారు. మంగళవారం కడపలోని డిఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడప డిఎస్‌పి మాట్లాడుతూ నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న బెస్త వీధిలో నివాసం ఉంటున్న షేక్ రషీదా భానుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. వీరిలో పెద్ద కుమారుడు షేక్ మొహమ్మద్‌కు మతిస్థిమితం లేదని, తన స్నేహితుడు పీరుల్లాఖాన్‌తో కలిసి అప్పుడప్పుడూ మద్యం సేవించేవాడని తెలిపారు. . ఈ క్రమంలోనే పండ్ల వ్యాపారి దగ్గర పని చేసి వచ్చిన తర్వాత సంపాదన డబ్బుల్లో కొంత తీసుకొని ఆదివారం రాత్రి అమీన్ ఫంక్షన్ హాల్ దాటిన తరువాత సర్యాజీపుర వీధిలో కంప చెట్లలో మద్యం సేవించాడన్నారు. చిన్న తమ్ముడు షేక్ అబూబసర్ అలియాస్ అబ్బు అతని స్నేహితుడిని చూసి ఎందుకు మీరు ఇలా తిరుగుతున్నారని వారితో వాగ్వాదానికి దిగాడని చెప్పారు. ఆగ్రహానికి గురై సొంత అన్నను ఆగ్రహావేశంతో ఊగిపోయి నాలుగు పోట్లను పొడిచి వెంటనే పరారయ్యాడని తెలిపారు. అతన్ని 24 సోమవారం రాత్రి గౌస్ నగర్ కెసి కెనాల్ సమీపంలో అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుంచి పిడిబాకును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. విచారణలో పిడిబాకును ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసుకొని హత్య చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకులకు రక్షణ కల్పించండి

కడప : దేశంలో బిజెపి నాయకుల నుంచి కాంగ్రెస్ నాయకులకు రక్షణ కల్పించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతంరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కడప డిఎస్‌పి షరీఫ్‌కు ఫిర్యాదు చేశారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు రక్షణ కరువైందన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఆయన సతీమణి, సభ్యులను హతమార్చేందుకు బిజెపి కుట్రపన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఆర్టిఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు ఉన్నారు.

రాష్ట్రం అధోగతిపై జగనన్నకు చెబుదామా : టిడిపి

కడప అర్బన్ : వైసిపి నాలగేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని జగనన్నకు చెబుదామా అంటూ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి వైసిపి ప్రభుత్వం చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఎద్దేవా చేశారు. గాయత్రి టవర్స్ లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు జీతాలు లేవు, పింఛన్ ఇచ్చేందుకు అప్పులు చేయాల్సిందే అన్నారు. మూడుసార్లు ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేశారని, పనులు ఎంతవరకు జరిగాయని జగనన్నకు చెబుదామా అని చమత్కరించారు. చక్కెర పరిశ్రమను, ఆల్విన్‌ను తెరిపిస్తామని, రాజోలి ప్రాజెక్టు, జిఎన్ఎస్ఎస్ పూర్తి చేశారా అని ప్రశ్నించారు. స్పందనలో ఏ సమస్య పరిష్కారం కావట్లేదని, బెదిరించి సమస్య పరిష్కారం అయినట్లు సంతకాలు అధికారులు చేయించుకుంటున్నారని చెప్పారు. జగనన్న స్టిక్కర్లు మురుగు కాలువల్లో వెలుస్తున్నాయని వాపోయారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

కాశినాయన : ఆయా గ్రామాల్లోని గర్భిణులు వైద్యుల సలహాలు కచ్చితంగా పాటించాలని మండల వైద్యాధికారి ప్రశాంతి తెలిపారు మంగళవారం మండల కేంద్రమైన ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 41 మంది గర్భిణులు హాజరయ్యారు అందరికీ డాక్టర్ ఆధ్వర్యంలో షుగర్, బిపి పరీక్షలు చేశారు. రిస్క్ కాన్పులు ఉన్నవారికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మల, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు రెడ్డి, పబ్లిక్ హెల్త్ నర్స్ శారద, ఆరోగ్య ప్రేక్షకులు బాలయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మరో స్వాతంత్ర్య పోరాటానికి సన్నద్ధం కావాలి

- చర్చా వేదిక కార్యక్రమంలో పలువురు వక్తలు

ప్రజాశక్తి - కడప

జగన్, మోడీ పాలనలో ప్రజాస్వామ్యానికి రక్షణ లేకుండా పోతుందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చర్చ వేదిక కార్యక్రమంలో వక్తలు అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ అధ్యక్షతన మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం– దళితులు, మైనార్టీలపై దాడులు' అనే అంశంపై చర్చ వేదిక నిర్వహించారు. పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి, టిడిపి నాయకులు అమీర్ బాబు, సిపిఎం నాయకులు ఏ. రామ్మోహన్, సిపిఐ నాయకులు గాలి చంద్ర, ఆమూరి బాలదాసు, ఆంజనేయులు, ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, మాజీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్, బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి గుర్రప్ప, కాంగ్రెస్ నగర అధ్యక్షులు విష్ణు ప్రీతం రెడ్డి, హేతువాద సంఘం సిఆర్‌వి ప్రసాద్, శ్రీనివాసులు, ఖాదర్ ఖాన్, అన్వర్, భాస్కర్, దళిత నాయకులు రెడ్డన్న, కాంగ్రెస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రజాస్వామ్య లౌకిక వాదాన్ని మనకు అందించారన్నారు. ప్రస్తుత పాలకులు, రాజ్యాంగాన్ని మార్చి మనోధర్మ రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు అన్ని రకాల కుతంత్రాలు చేస్తున్నారన్నారు. వీరి కుట్రలో భాగంగా ప్రజాస్వామ్యంపై, దళితులపై, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ముస్లిములకు రిజర్వేషన్లు తొలగిస్తామని అమిత్ షా ప్రకటించారన్నారు, అందులో భాగంగానే మొదట కర్ణాటకలో తొలగించారన్నారు. బిజెపి ప్రభు త్వం ప్రవేశపెట్టే బిల్లులన్నింటికీ వైసిపి, టిడిపి బేషరతుగా మద్దతి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

స్తున్నాయన్నారు. అధికార వైసిపి ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్, డాక్టర్ అచ్చెన్న లాంటి వారిని చంపటం వెలుగులోకి వచ్చాయన్నారు. వెలుగులోనికి రానివి మరెన్నో ఇలాంటివి ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం దళితులకు ఉన్న రిజర్వేషన్లను రద్దు చేసేందుకు చాప కింద నీరు లాగా సోషల్ మీడియాలో ప్రచారం చేయిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ రద్దు చేయడానికి సామాజిక మాధ్యమాల్లో కుట్ర చేస్తున్నారన్నారు. పౌరసత్వ చట్టాన్ని చేసి తెలివి మాలిన పని చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, బ్యాంకులు, ఎయిర్ ఫోర్స్, నౌకారంగం, రైల్వే లాంటి వాటిని ప్రయివేట్ పంర చేశారన్నారు. ప్రశ్నించిన రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేశారన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు కలిసి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చర్చా వేదిక కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన అవసరం

కడప : విద్యార్థులు చదువుతో పాటు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని సర్వ శిక్ష అభియాన్ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి సూచించారు. యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో స్టెప్ సిఇఒ సాయి గ్రేస్ అధ్యక్షతన కడప నగరంలోని పొట్లంపల్లిలో ఉన్న మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్ కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉంటారని అన్నారు. యువత సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని అన్నారు. ప్రస్తుత టెక్నాలజీని మంచి కోసం వినియోగించుకుంటే సగం విజయం దక్కినట్టే అని అన్నారు. సిఇఒ మాట్లాడుతూ పదవ తరగతి తరువాత స్థిర పడాలనుకునే విద్యార్థులు సానుకూల దృక్పథంతో, ఓర్పు సహనంతో వారికి తగ్గ జాబ్ ఓరియంటెడ్ కోర్సులు ఎంచుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని ముందుకెళ్లాలన్నారు. విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ డాక్టర్ ముఖ్ సిద్ ఖాన్ మాట్లాడుతూ తమ కళాశాలలో యువతకు ఇటువంటి అవగాహనా కార్యక్రమాల నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో 150 మంది విద్యార్థులు ప్రోగ్రాం అధికారి మొహమ్మద్ సికందర్ హుస్సేన్, హెచ్ఒడిలు డాక్టర్ హకీముద్దిన్, విలాయత్ అలీ బెగ్, ఖాజామొహిద్దీన్, కళాశాల, స్టెప్, క్రీడా సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరం

కడప అర్బన్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం ఉత్సాహంగా సమ్మర్ క్యాంపులో విద్యార్థులు పాల్గొన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, కథలు, క్రాఫ్ట్, డాన్స్ నిర్వహించారు. ఉదయం లైబ్రేరియన్ జేమ్స్, నవాబ్ జాన్ పిల్లలకు కథలు చదివి వినిపించారు. ఈ కథలు వల్ల పిల్లలకు వినగలిగే సామర్థ్యం పెరగడంతో పాటు మంచి–చెడుల తేడాను గ్రహించవచ్చుని తెలిపారు. టీచర్ జగదీశ్వర రెడ్డి స్పోకెన్ ఇంగ్లిష్ చెప్పారు. ఇంగ్లిష్ మాట్లాడటం చాలా మందికి భయమని ఈ భయం పోవాలంటే రోజువారీ ఇంగ్లిష్ దినపత్రికలు చదవాలని పేర్కొన్నారు. క్రాఫ్ట్ టీచర్ రంగనాయకులు రంగు కాగితాలతో వివిధ రకాల పూలు ఎలా తాయారు చేస్తారో పిల్లలకు నేర్పించారు. డాన్స్ మాస్టర్ వెస్లీన్ డాన్స్ ఎలాచేయాలో పిల్లలలకు మెలుకువలు తెలిపారు. సమ్మర్ క్యాంపుకు దాదాపు వందమందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూ టీ లైబ్రేరియన్ పవన్ కుమార్, సురేష్ ,సుబ్రమణ్యం, నాగలక్ష్మి ,సుబ్బమ్మ పాల్గొన్నారు.

ర్యాంకర్లకు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ట్రంక్ రోడ్‌లో ఉన్న సొసైటీ కార్యాలయంలో ఇంటర్ బైపిసి ఫస్ట్ ఇయర్‌లో 440కు 436 మార్కులు సాధించిన పి. నఫీసా ఖానం, పదవ తరగతి లో 600 కు 592 మార్కులు సాధించిన సయ్యద్ అఫీఫా అంజుమ్‌కు మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు షేక్. అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మాన అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎస్ఎ పిఒ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి విద్యార్థులు ఉన్నత మార్కులను సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావడం ఎంతో ప్రశంసనీయమన్నారు. పూల వ్యాపారిగా పని చేసుకుంటున్న కూతురికి ఇంటర్ బైపీసీలో స్టేట్ 2 వ ర్యాంక్, మెకానిక్ కూతురికి పదవ తరగతిలో స్టేట్ 4వ ర్యాంక్ రావడం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి దేశానికి ఉత్తమ సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్, సంఘ సేవకులు మొహమ్మద్ తాజుద్దీన్, విద్యార్థుల తల్లిదండ్రులు పి అబ్బాస్ అలీ ఖాన్, సయ్యద్ ఖాజాపీర్ పాల్గొన్నారు.

గుర్తింపు రద్దును నిరసిస్తూ ఆందోళన

ప్రజాశక్తి - కడప అర్బన్

తపాలా శాఖలో అతిపెద్ద ఆర్గనైజేషన్ అయినా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్, అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్‌సి లు గుర్తింపు రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఖండిస్తూ ఆ సంఘాల కేంద్ర నాయకత్వం పిలుపుమేరకు కడప పోస్టల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రూప్ సి సెక్రటరీ జీవీ సుబ్బారెడ్డి, సలాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ల గుర్తింపును పునరుద్ధరించాలన్నారు. లేనిపక్షంలో కేంద్ర నాయకత్వం ఇచ్చే పిలుపుమేరకు పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమణయ్య, గురువారెడ్డి, పురుషోత్తం, ఓబయ్య, రవికాంత్, పాలకొండ్రాయుడు, గోవిందు, పూర్ణచందర్, ప్రభాకర్, నాగేంద్రారెడ్డి, సోమశంకర్ పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను రద్దు చేయాలి

కడప అర్బన్ : కౌన్సెలింగ్ విధానానికి విఘాతం కలిగిస్తూ ప్రజాప్రతినిధుల సిఫారసు మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే నేరుగా చేపట్టిన టీచర్ల అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎపిటిఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవి సెలవుల్లో పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలను చేపడతామని ఓవైపు విద్యాశాఖ మంత్రి చెబుతూనే మరోవైపు బదిలీలకు ముందే ప్రజాప్రతినిధుల సిఫారసు మేరకు నిబంధనలకు విరుద్ధంగా కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ సిఫారసు బదిలీలను చేయడం వల్ల సుదీర్ఘకాలంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. బదిలీల కోసం ఎదురుచూస్తున్న వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఈ సిఫారసు బదిలీల వల్ల అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే సిఫారసు బదిలీలను రద్దుచేసి బదిలీలు, ప్రమోషన్ల మార్గదర్శకాలను, షెడ్యూల్‌ను విడుదలచేయాలని డిమాండ్ చేశారు. టీచర్లను నాన్ వెకేషన్ డిపార్టుమెంటుగా ప్రకటించి 30 రోజుల ఆర్జిత సెలవులు ఇవ్వాలన్నారు. రెమిడియల్ తరగతుల పేరుతో ఉన్నతపాఠశాలల ఉపాధ్యాయులను పాఠశాలలకు పంపడం సరికాదన్నారు. ప్లస్ 2 ఉన్నతపాఠశాలలకు అర్హతలు కల్గిన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా ఉద్యోగోన్నతులు ఇచ్చి నియామకాలు చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట కౌన్సిలర్లు ఖాదర్ బాషా, గురయ్య, సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

షేక్‌హుస్సేన్‌ను పరామర్శించిన మేయర్


కడప : కడప నగరంలోని శ్రీకర ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ షేక్ హుస్సేన్‌ను మంగళవారం వైసిపి జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ కే సురేష్ బాబు పరామర్శించారు. షేక్ హుస్సేన్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ రామాంజులరెడ్డితో అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వైసిపి నాయకులు ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారులు ప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్ రామ లక్ష్మణ రెడ్డి, డివిజన్ ఇన్‌ఛార్జి కిరణ్ పాల్గొన్నారు.

ప్రముఖ ఉర్దూ కవికి ఆహ్వానం

కడప : కడపకు చెందిన ప్రముఖ ఉర్దూ కవి మహమూద్ షాహిద్‌కు సౌదీ అరేబియా నుంచి ఆహ్వానం అందింది. ఇది కడపకే గర్వకారణం అని చెప్పవచ్చు. ఆజాదీక అమృత్ మహోత్సవంలో భాగంగా సౌదీ అరేబియా రియాద్‌లోని ఇండియన్ ఎంబసి వారు నిర్వహిస్తున్న ఉర్దూ కవి సమ్మేళనకు మన దేశం నుంచి 12 మంది ప్రముఖ కవులకు ఆహ్వానం అందింది. అందులో దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం కల్పిస్తూ కడపకు చెందిన ప్రముఖ ఉర్దూ కవి మహమ్మద్ షాహిద్‌కు ఆహ్వానంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రెమిడియల్ క్లాసులు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న లెక్కల జమాల్‌రెడ్డి

వేసవి సెలవులలో రెమిడియల్ క్లాసులు ఉపసం హరించుకోవాలని, లేదా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్‌ను నాన్ వెకేషన్ డిపార్ట్ మెంట్‌గా ప్రకటించాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి కోరారు. మంగళవారం డిఇఒ రాఘవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులలో రెమిడియల్ క్లాసులు నిర్వహించడం సమంజసం కాదని తెలిపారు. ఉపాధ్యాయుల కృషి వల్ల రాష్ట్రంలో పదవ తరగతి ఫలితాల్లో వైఎస్ఆర్ జిల్లా నాలుగవ స్థానం సంపాదించిందని చెప్పారు. వెంటనే రెమిడీయల్ క్లాస్ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కడప : నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ పనులు నిర్వహిస్తున్నందున బుధ, గురువారాల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని విద్యుత్ ఎఇ షకీల్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాసాపేట సర్కిల్, నిర్మలకాన్వెంట్, కొత్తకోట్టాలు, సుబ్బారత్నమ్మ కానీ, మాచుపల్లి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఈవిషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.



రుణాలందిస్తున్న పెద్దలు

బ్యాంక్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వడ్డీభారం నుండి ప్రజలను రక్షించేందుకు వడ్డీ రహిత ఫిద్రత్ బ్యాంకు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామని లైన్‌మెన్ ఇమామ్ మౌలానా ఆరిఫ్‌వుల్లాహ్ తెలిపారు. ఫిద్రత్ బ్యాంకు ద్వారా మంగళవారం 31 మంది చిరు వ్యాపారులకు రూ.10లక్షల రుణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమాతె ఇస్లామి హింద్ ఫిద్రత్ శాఖను స్థాపించి కులమతాలకు అతీతంగా వడ్డీలేని రుణాలిస్తూ సామాన్యులకు సేవలందిస్తోందన్నారు. రుణాలు తీసుకున్నవారు మళ్లీ చెల్లించి సంస్థ పురోభివృద్ధికి తోడ్పాటునివ్వాలన్నారు. సమాతె ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షులు హుసేన్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు మహబూబ్ షరీఫ్, బ్రాంచ్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు షేక్ సలీం బ్యాంకు సేవలను వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఇంతియాజ్ అహ్మద్, క్యాషియర్ రఫి పాల్గొన్నారు.

రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ రద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఆర్‌ఎస్‌ఎ) కడప జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఎ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు బి.ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షులు టి.జగన్‌ను తొలగించినట్లు తెలిపారు. జిల్లాలోని విద్యాసంస్థల వద్ద ఆర్‌ఎస్‌ఎ సంఘం పేరు చెబితే తెలపాలన్నారు. త్వరలో నూతన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.



విద్యార్థులకు కథలు చెబుతున్న కవి చదువుల బాబు

బాల సాహిత్యం విజ్ఞానానికి సోపానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు రామేశ్వరం బాల బాలికల గ్రంథాలయ ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా కవి రచయిత డి కె చదువుల బాబు విద్యార్థులకు కథల ప్రాముఖ్యత వివరించారు. కథలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. సత్ప్రవర్తనను, మంచిచెడు విచక్షణను పెంపొందించి విద్యార్థుల నడవడికను సన్మార్గంలో పెడతాయన్నారు. ఎలుగుబంటి, పందెం, కాలం విలువ మొదలగు కథలను విద్యార్థులకు వినిపించారు. కార్యక్రమంలో కవి జింక సుబ్రహ్మణ్యం, వైవిఎస్ ఇంజనీర్ వెంకటరెడ్డయ్య, యోగ టీచర్ వెంకటసుబ్బయ్య, శ్రావణి, గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్, రెహమాన్ ఖాన్, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పులివెందుల గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం విద్యార్థులకు కథలు, పద్యాలు చెప్పారు. డ్రాయింగ్ మొదలగు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్రాయింగ్ వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, సురేష్, లైబ్రేరియన్ కృష్ణ కిషోర్‌రెడ్డి, పాఠకులు బాలకృష్ణ, నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు



కదలని మురుగు.. తొలగని పూడిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక గుడు మస్తాన్ దర్గా వీధిలోని కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. పూడిక సకాలంలో తొలగించకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు దోమలు అధికమవుతున్నాయి. స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జమ్మలమడుగు నగర పంచాయతీ అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తొలగించి మురుగు ముందుకు వెళ్లేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు జమ్మలమడుగు మండల సర్వసభ్య సమావేశం

జమ్మలమడుగు రూరల్ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పర్వీన్ అరుంధతి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం లైవ్ కార్యక్రమానికి ఎంపిడిఒ, ఎంపిపి జి.హరిత, జడ్‌పిటిసి, అధికారులు హాజరయ్యారు.

నేడు వేంకటేశ్వర స్వామి రథోత్సవం

జమ్మలమడుగు రూరల్ : శ్రీ నారాపుర వేంకటేశ్వర స్వామి దేవస్థానం వారు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రథోత్సవం జరగనుందని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడం జరుగుతుందని, అయితే స్వామి వారి రథం ముందుకు సాగే క్రమంలో ప్రజలు, భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు-తాడిపత్రి ప్రధాన రహదారిలోని యామవరం గ్రామం వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన లారీ డ్రైవర్ రంగస్వామి (64) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సిఐ నరేష్‌బాబు తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. గుంతకల్లు పట్టణానికి చెందిన లారీ బరిస్ పైపులతో ముద్దనూరు మీదుగా మైదుకూరు వెళ్తుండగా యామవరం గ్రామం వద్దకు రాగానే ఎర్రగుంట్ల వైపు నుండి వెళ్తున్న లారీని ఎదురుగా ఢీ కొంది. ప్రమాదంలో అనంతపురం జిల్లా గుంతకల్లు టౌన్ హనుమేష్ నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ రంగ స్వామి తీవ్రంగా గాయపడ్డాడు. 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎర్రగుంట్లకు చెందిన లారీ డ్రైవర్‌కు కాలు విరిగింది. మృతుడి కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

ముగిసిన శనగల కొనుగోలు ప్రక్రియ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రబీ సీజన్‌కు సంబంధించి మండల వ్యాప్తంగా దాదాపు 12,300 ఎకరాల్లో శనగ పంటను రైతులు పండించారు. ప్రభుత్వం శనగ పంటకు మద్దతు ధరగా 5335 రూపాయలుగా ప్రకటించి, స్థానిక మార్కెట్ యార్డులో నాఫెడ్ ఆధ్వర్యంలో శనగ పంట కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మండల వ్యాప్తంగా సరాసరిన దాదాపు 86 వేల క్వింటాళ్లు దిగుబడి వచ్చినట్లు తెలుస్తోంది. కలమల్ల ఆర్ బి కే నుండి 116 క్వింటాళ్లు, పోట్లదుర్తి 2324 క్వింటాళ్లు, తిప్పలూరు 4993 క్వింటాళ్లు, పెదనపాడు 1691 క్వింటాళ్లు, చిన్నదండ్లూరు 152 క్వింటాళ్లు, చిలమకూరు 181.5 క్వింటాళ్లు, తుమ్మలపల్లి 316 క్వింటాళ్లు, హనుమనగుత్తి 1260 క్వింటాళ్లు, నిడుజీవ్వి 569 క్వింటాళ్లు, మాలపాడు 1155 క్వింటాళ్లు,ఎర్రగుంట్ల 708.5 క్వింటాళు మాత్రమే రైతులు శనగ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తరలించారు.మొత్తంగా 13466 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తరలించినట్లు ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి.ఇందులో కూడా కొందరు దళారులు రైతు పాసుపుస్తకాల మీద ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో శనగలు వేసినట్లు సమాచారం.చాలామంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో శనగలు వేస్తే డబ్బులు వస్తాయో రావో అన్న అనుమానంతో వేయలేదు అనేది వాస్తవం. దీనిని బట్టి అధికారులు రైతులకు భరోసా కల్పించడంలో విఫలమయ్యారని చెప్పవచ్చు. దీని కారణంగానే మండల వ్యాప్తంగా దాదాపు 86 వేల క్వింటాళ్లు శనగ పంట దిగుబడి వస్తే కేవలం 13 వేల క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వేశారు. దీన్నిబట్టి ప్రభుత్వంపై రైతుల్లో అపనమ్మకం, వ్యతిరేకత మెండుగా కనిపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. అయితే ఈ ఏడాది నాఫెడ్ మాత్రమే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీంతో రైతులు ఆ కొనుగోలు కేంద్రంపై ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

సాగునీటికి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటికి అధిక ప్రాధాన్యతనిచ్చి, రైతులు రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం కల్పించామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఎంపిపి టి.లక్ష్మమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కెసి కెనాల్ చరిత్రలో ఏప్రిల్ చివరి వరకు సాగునీరు ఇచ్చిన దాఖలాల్లేవన్నారు. గత ప్రభుత్వంలో సాగునీటి కోసం ధర్నాలు, పోరాటాలు చేయాల్సి వచ్చేద న్నారు. ప్రస్తుతం రైతులు అడగకుండానే నీటిని విడుదల చేస్తున్నామన్నారు. పంట నష్టం జరిగిన సీజన్‌లోనే రైతులకు వెంటనే నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కేవలం చాపాడు మండలానికి రూ.28 కోట్ల పంట నష్టపరిహారం సకాలంలో ఇచ్చామన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు 1100 క్వింటాళ్ల జీలగలు మంజూరయ్యాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. త్వరలో 500 గృహాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 69 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని ఉత్తీర్ణత పెరిగేలా చూడాలన్నారు. కెసి కెనాల్ పరిధిలో రూ.3.30 కోట్లతో అభివృద్ధి పనులు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎంపిపి లక్ష్మయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్‌బికె, హెల్త్ క్లినిక్‌లను వెంటనే పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులకు సూచించారు. తహశీల్దార్ సుభాని సమావేశానికి హాజరై తన శాఖకు సంబంధించిన సమస్యలపై చర్చించకుండానే మధ్యలో అధ్యక్షుల అనుమతి లేకుండా వెళ్లిపోయారు. దీంతో తాము సమావేశాలకు హాజరుకావడం ఎందుకని ప్రజాప్రతినిధులు పెదవి విరిచారు. సమావేశం పూర్తయ్య వరకు ప్రతి ఒక్క అధికారి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ శ్రీధర్ నాయుడుకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి శుభకరణమ్మ, మండల అధికారులు మ్యాగీ, రవిశంకర్, ఈశ్వరయ్య, మహబూబ్ బాషా, రాధాకృష్ణవేణి, భరత్‌కుమార్‌రెడ్డి, జాన్సన్, రాజ్యలక్ష్మి, పద్మారాణి, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిఎం మానస పుత్రిక 'స్కిల్ శిక్షణ'

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్కిల్ శిక్షణా కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మానసపుత్రిక అని ఎపి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని న్యాక్ శిక్షణా కళాశాలను అజయ్‌రెడ్డి, న్యాక్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ దినేష్‌రెడ్డి మంగళవారం శిక్షణా కార్యక్రమాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి శిక్షణా కార్యక్రమానికి సంబంధించిన ట్రైనీలతో శిక్షణ జరిగే విధానం గురించి అడిగి తెలుసు కున్నారు. శిక్షణ తర్వాత ఉపాధి అవకాశాల గురించి ట్రైనీస్ కు వివరించారు. కొత్తగా ప్రారంభించిన సోలార్ ఇంజనీర్ శిక్షణ తరగతులు, ప్రాక్టికల్ ల్యాబ్ సౌకర్యాలను పరిశీలించారు. డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని గురించి తెలుసుకున్నారు. అనంతరం అజయ్‌రెడ్డి మాట్లాడుతూ స్కిల్ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎన్.జితేంద్ర, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్.శివప్రసాద్, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్, న్యాక్ అసిస్టెంట్ ఇన్‌ఛార్జి చెన్నకేశవులు పాల్గొన్నారు.



శిక్షణ కళాశాలను తనిఖీ చేస్తున్న కొండూరు అజయ్‌రెడ్డి

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు సురక్షితం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - కొండాపురం

మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.సుజాత ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులను పరీక్షించారు. కాన్పు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పౌష్టికాహారం, వైద్య సదుపాయాలు, తీసుకోవలసిన మందులు, కాన్పు కోసం ఎంచుకోవాల్సిన ఆసుపత్రి, ప్రయాణ సదుపాయాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ కళావతి, ఆరోగ్య విస్తరణాధికారి ధనలక్ష్మి, స్టాఫ్ నర్సులు, సిహెచ్‌ఒలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పి.అనంతపురం శివాలయంలో మంగళవారం ఫ్యామిటీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రొగ్రామ్ మెడికల్ ఆఫీసర్ సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒ నర్సింహులు, రాము, సత్యవాణి, సునీత, కిరణ్‌కుమార్, రాజేష్, లీలావతి పాల్గొన్నారు.

ఖాజీపేట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారండాక్టర్ ఎస్.ముబీన్ ఆధ్వర్యంలో గర్భిణులకు పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ముబీన్ మాట్లాడుతూ మహిళల్లో మూడోంతుల మంది రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నట్లు అధ్యయనాలు తెలుపుతున్నాయని తెలిపారు. రక్తంలో హిమోగ్లోబిన్ ఎక్కువగా ఉన్నప్పుడే పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్లు అర్థమన్నారు. గర్భిణులు ఎక్కువగా ఆకుకూరలు, బీట్ రూట్, క్యారెట్ రసాలతో శరీరంలో తొందరగా రక్తం వృద్ధి చెందుతుందని సూచించారు. అలాగే నల్ల ద్రాక్ష, ఆపిల్, దానిమ్మ, వంటి పండ్లను తినలేకపోతే పండ్ల రసాలు తాగచ్చని సూచించారు. డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల శక్తితోపాటు ఐరన్ కూడా అధిక మోతాదులో శరీరానికి అందుతుందని తెలిపారు. బెల్లంతో వేరుశనగలు, నువ్వులతో చేసిన పదార్థాలను తీసుకుంటే రక్త హీనత రాదన్నారు. అనంతరం సూపర్‌వైజర్ బి.కృష్ణప్రియ, ఆశ నోడల్ అధికారి అరుణకుమారి, సిహెచ్‌ఒ వెంకటసుబ్బమ్మ గర్భిణులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య విస్తరణ అధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్స్, ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒలు, ఆశా కార్యకర్తలు, ఫార్మసిస్ట్, పాల్గొన్నారు.

చాపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎంఎస్‌ఎంఎ కార్యక్రమంలో భాగంగా 67 మంది గర్భిణులకు వైద్యులు సుమిత్ర, శ్రీవాణి, కావ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పు కావాలని సూచించారు. అక్కడికి వచ్చిన గర్భిణులకు కేతవరం మాజీ సర్పంచు గంజికుంట వీర ప్రతాప్ దంపతులు భోజన వసతి ఏర్పాటు చేశారు. అనంతరం ప్రతాప్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు ఎమ్మెస్ తేజ, సిహెచ్‌ఒ రాముడు, సూపర్వైజర్ సరస్వతి, ఏఫ్ పిఏస్ పర్యవేక్షకులు భాస్కర్, రమేష్, ఎఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.



గర్భిణులకు అన్నం వడ్డిస్తున్న దాతలు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఆసుపత్రిలో కాన్పులు సురక్షితమని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా పేర్కొన్నారు. మంగళవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులు శ్రీనివాస్, సుస్మిత గర్భిణులకు ఉచిత వైద్య, ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు, వారికి తోడుగా వచ్చినవారికి సీమాంధ్ర బి.సి.సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఉచిత భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ క్రిష్ణమ్మ, హెచ్‌ఇ శోభారాణి, సూపర్‌వైజర్ బిఎ వరప్రసాద్, స్టాఫ్‌నర్స్ విజయమ్మ, సుబ్బమ్మ, సిహెచ్‌ఒ గంగతులసి, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీనారాయణ, నాగసుహాసిని, ఎల్‌టి ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత ఇలాకా అయిన పులివెందులను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో దాదాపు రూ.631 కోట్ల తో దాదాపు 29రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిని శరవేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ్ రామరాజు ఆదేశించారు. ప్రతి మంగళవారం కలెక్టర్ పులివెందులలో అభివృద్ధి పనులపై పర్యవేక్షిస్తూ, సమీక్షిస్తారు. ఇందులో భాగంగానే ఆయన పులివెందులకు ఆర్అండ్‌బి అతిథిగృహంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోపు జరుగుతున్న పనులన్నీ పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతిరోజు అధికారులు పనులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఇప్పటివరకు జరిగిన పనుల గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ముందుగా కలెక్టర్ గరండాల వంక, నగరవనం, క్రికెట్ స్టేడియం, షాపింగ్ కాంప్లెక్స్, స్పోర్ట్స్ గదుల పనులను పరిశీలించారు. న్యాక్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం శిక్షణ నిర్వాహకులతో కలెక్టర్ మాట్లాడారు. పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ డైరెక్టర్ మరక కృష్ణారెడ్డి, అధికారులు, శిక్షణ నిర్వాహకులు సేవటిబక్షి, మనీష్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

టిడిపి గెలుపు.. రాష్ట్రాభివృద్ధికి మలుపు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగుదేశం పార్టీ గెలుపు రాష్ట్రాభివృద్ధికి మలుపు అని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు 11వ వార్డు నేతాజీనగర్‌లో ఆయన ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 40 నెలలు పూర్తవుతున్నా, స్టీల్‌ప్లాంట్ పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. అన్ని రకాల పన్నులు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డి మట్టిలో మాణిక్యం



విద్యార్థి తల్లిదండ్రులను సన్మానిస్తున్న చైర్మన్

జమ్మలమడుగు రూరల్ : పదవ తరగతిలో 589 మార్కుల సాధించిన డివి సుధీర్‌రెడ్డి మట్టిలో మాణిక్యం అని జీవనజ్యోతి విద్యాసంస్థల చైర్మన్ గురుదేవ్ రామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టికెఆర్ జీవనజ్యోతి హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 589 మార్కులు రావడం ఈ గ్రామీణ ప్రాంతంలో చాలా గొప్ప విషయమన్నారు. విజయాలను సాధించేందుకు పేదరికం అడ్డురాదని సుధీర్‌రెడ్డి, ఎమ్ లిఖిత, పి.జాస్లీన్ నిరూపించారన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు డి. చిన్నగురుశేఖర్ యాదవ్ మాట్లాడారు. అత్యుత్తమ ఫలితాలను అందించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పాఠశాల తరఫున వందనాలు తెలిపారు.



స్థల పరిశీలనలో జెసి గణేష్‌కుమార్, ఆర్‌డిఒ, రెవెన్యూ అధికారులు

బస్టాండ్, డిసిసి బ్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు పాత పోలీస్ క్వార్టర్స్ స్థలంలో బస్టాండ్ నిర్మించేందుకు మంగళవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ రమాకుమారి ఇక్కడ బస్టాండ్ నిర్మాణానికి అనువుగా ఉంటుందన్నారు. కాళికమ్మ గుడి వద్ద, పోలీస్‌స్టేషన్ పక్కన స్థలాలను జెసి పరిశీలించారు. డిసిసి బ్యాంకు భవన నిర్మాణానికి అనువైన స్థలం కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి సూచన మేరకు బంగ్లా ఆవరణలో స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి

ప్రజాశక్తి - దువ్వూరు

రాష్ట్రవ్యాప్తంగా 104 వాహనం ద్వారా విధులు నిర్వర్తించే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డేటా ఎంట్రీ ఆపరేటర్ రామచంద్రారెడ్డి, డ్రైవర్ మహబూబ్ బాషా కోరారు. ఆ మేరకు మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగ భద్రత కోరుతూ దువ్వూరు, చింతకుంట పిహెచ్‌సి వైద్యాధికారులు సురేష్ బాబు, షేక్ రోషిణి, వికసితకు వినతిపత్రమిచ్చారు.



వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

'జగనన్నకు చెబుదాం'పై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వీక్షించారు. చాపాడు ఎంపిడిఒ సభాభవనంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని స్థానిక అధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకునేలా చైతన్యపరచాలని సూచించారు. ప్రభుత్వ పథ కాలలో ఎలాంటి ఇబ్బందులున్నా 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

జగన్‌వి నియంతృత్వ పోకడలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డివి నియంతృత్వ పోకడలని, అవి పోవాలంటే చంద్రబాబు సిఎం కావాలని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు. స్థానిక మైదు కూరు రోడ్డులో మంగళవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ నియంత పాలనను ప్రజలు గమనిస్తున్నారని తెలి పారు. వైసిపి పాలనలో రైతులు చితికిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల జగన్ పాలనలో ఎక్కడ కూడా శాశ్వత అభివృద్ధి జరగలేదన్నారు. జనాకర్షణ పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి,14వ వార్డు మస్తాన్ గోలే, 9 వార్డు కరీముల్లా, మెరువా మూర్తి, గోపవరం గౌస్, భగత్ సింగ్ కాలనీ పట్నం మాబాషా, శివ, మహేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో త్వరలో అన్న క్యాంటీన్ పేరుతో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నట్లు టిడిపి నాయకుడు సురేష్‌నాయుడు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్ స్వగృహంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న పియన్‌ఆర్‌లో ఈ అన్నదాన కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు. రోజుకు 2000 మందికి అన్నదానం చేస్తామన్నారు. పట్టణంలో పలుచోట్ల మొబైల్ వ్యాన్ ద్వారా కూడా అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. తమ నిర్ణయాన్ని తెలుసుకొని హడావిడిగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి రాజన్న భోజనం ప్రకటించడం తమకు పోటీగా అని భావిస్తున్నామన్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వంలో ఉండి అధికారాన్ని అనుభవిస్తూ ఈ ఉచితాన్నదాన నిర్ణయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో టిడిపి అభ్యర్థిత్వాన్ని తాను ఆశిస్తున్నట్లు స్పష్టం చేశారు. తనతో పాటు ఇంకా నలుగురం టికెట్ ఆశిస్తున్నామని ఆశించడంలో తప్పులేదని చివరికి చంద్రబాబు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి అందరం టిడిపి జెండాను ప్రొద్దుటూరులో ఎగుర వేసేందుకు నిబద్ధతతో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ముక్తియార్‌తోపాటు టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌పి మహబూబ్‌హుశేన్, మైనార్టీ సెల్ పట్టణ ఉపాధ్యక్షుడు నీలగిరి బాబా, 34వ వార్డు ఇన్‌ఛార్జి నీలాపురం బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌నాయుడు

ప్రకటన

ఈ నోటీసు మూలంగా ప్రతివాదులైన ఒకటి కొట్టాలా ఖజా షర్ఫుద్దీన్ ప్రతివాది 4,కె. షాహీనా పర్వీన్ ప్రతివాది 6 కె.సుల్తానా పర్వీన్ ఎనిమిదో ప్రతివాది కొట్టాల షాహిరాబానులకు ఈ ప్రతి వాదులు నా కక్షిదారులైన రుక్సానా పర్వీన్ ఆమె జీపీఏ హోల్డర్ అయినా ఎస్.అమీర్ హంజా ద్వారా రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ప్రొద్దుటూరు నందు ఓ ఎస్ నంబర్ 213 పబ్లిక్ 2022 అను వ్యాజ్యము దాఖలు చేసినారు. ఇందులో రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రొద్దుటూరు వారు మీలో మొదటి ప్రతివాది అయిన కొట్టాల ఖజా షరీపుద్దీన్ నాలుగవ ప్రతివాది అయిన కొట్టాల షాహినా పర్వీన్ ఆరవ ప్రతివాది అయిన కొట్టాల సుల్తానా పర్వీన్ 8వ ప్రతివాది అయిన కొట్టాల షాహిరా భానులకు ప్రజాశక్తి డైలీ న్యూస్ పేపర్ ద్వారా సమన్లు ముద్రించమని ఐ ఏ నంబర్ 271/ 2023 మరియు ఐఏ నంబర్ 278 / 2023 ద్వారా ఆదేశించారు. అందువలన ఈ ప్రకటన మూలంగా మీకు తెలియజేయడమేమనగా 11 మే 2023 10:30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ లేదా మీ వకీల్ ద్వారా కానీ కేసుకు సంబంధించి ఏవైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలియజేయగలరు. అట్లు మీరుపై తారీఖున పై గంటలకు కోర్టుకు రాని ఎడల మీ పరోక్షమున పై కేసు తీర్మానించబడును

ఎం. వేణుగోపాల్,
వాదితరపున న్యాయవాది,
ప్రొద్దుటూరు.